

8లో..

# స్ప్రింగ్ స్ప్రీలో సందడి చేయనున్న బ్రహ్మానందం

- ఎన్ఐటీలో ఈ నెల 28 నుంచి మార్చి 2 వరకు
- ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు సుముఖత


వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 137
పేజీలు : 08 | వెల: రూ.5/-

గురువారం
ఫిబ్రవరి 20, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# ఇసుక అక్రమ రవాణాపై..

# పటిష్ట నిఘా



## రంగంలోకి మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్

- కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి రీచ్ ల పరిశీలన
- 24/7 ఆన్లైన్ సేవలు అందుబాటులోకి అంటూ ప్రకటన
- పారదర్శకంగా ఇసుక లభించేందుకు ఏర్పాట్లు
- 'చెక్ పడేనా' కథనంతో అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన



చెక్ పడేనా..?

- ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం సీరియస్
- కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు
- విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ నిఘా
- వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్
- అక్రమార్కులకు సహకరించే అధికారులపై వేటు
- వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు

నిన్నమొన్నటి వరకు తోడుకున్నోడికి తోడుకున్నంత అన్న చందంగా సాగిన ఇసుక దందాపై ప్రభుత్వం సీరియస్ గా ఉంది. గోదావరి, ఆకేరుతోపాటు ఇతర వాగుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున తరలిపోతున్న ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఇసుక విషయంలో కఠినంగా వ్యవహరించాలంటూ జిల్లా కలెక్టర్లకు, ఎస్పీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకుగాను మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అలాగే అవసరమైన ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాలకు కూడా ఇసుక తరలిపోకుండా చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ఇసుక అక్రమ రవాణాకు సహకరించే అధికారులపై వేటు తప్పదంటూ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఇసుక రీచ్ లపై నిఘా పెంచింది. అయితే ఇది మూడు నాళ్ల ముచ్చటలా కాకుండా ప్రభుత్వం సీరియస్ గా అమలు చేస్తే భూగర్భ జలాలు పెరిగి తెలంగాణ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయ పడుతున్నారు.
- వరంగల్ వాయిస్ ప్రతినిధి

వరంగల్ వాయిస్ epaper.warangalvoice.net

ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం సీరియస్ గా వ్యవహరిస్తోంది. 'చెక్ పడేనా'పేరిట వరంగల్ వాయిస్ లో బుధవారం వచ్చిన కథనంతో మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ స్వయంగా రంగంలోకి దిగారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలంటే పటిష్ట నిఘా అవసరమంటూ అధికారులకు సూచించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ మండలం బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, అన్నారం, పలుగుల, పూసుకు పల్లి, ముద్దుల పల్లిలలో ఇసుక రీచ్ లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. పేద ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా ఇసుక లభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగానే ఇసుక కోసం 24/7 ఆన్లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. అక్రమంగా ఇసుక తరలించే వారితో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితిల్లోనూ ఇసుకాసురులను వదిలి పెట్టేదే లేదంటూ హెచ్చరించారు. ఆయన హెచ్చరికలతో అధికారులంతా అప్రమత్తమయ్యారు.
- వరంగల్ వాయిస్ మహాదేవపూర్

వివరాలు 2లో..

# భద్రకాళి గుడిలో హీరో గోపీచంద్

- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- మహదాశీర్వచనం చేసిన అర్చకులు



వరంగల్ మహా నగరంలోని చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని ప్రముఖ తెలుగు చిత్ర హీరో గోపీచంద్ గురువారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ సహాయ కమిషనర్, ఈఓ శేషుబారతి స్వాగతం పలికారు. అనంతరం అలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలు బహుకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. –వరంగల్ వాయిస్, కాశిబుగ్గ

## మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత



8లో..

- నైపుణ్య, శిక్షణాభివృద్ధికి ఊతం
- కలెక్టర్ పి.ప్రావీణ్య
- దామెర మండలం ల్యాదెల్లలో ఏర్పాటు

## మత్తు వదిలించాలి

- అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలి
- కలెక్టర్ డాక్టర్ సత్య శారద



2లో..

# ఇసుక అక్రమ రవాణాపై.. పటిష్ట నిఘా



- రంగంలోకి మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్
- కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి రీచ్ ల పరిశీలన
- 24/7 ఆన్లైన్ సేవలు అందుబాటులోకి అంటూ ప్రకటన
- పారదర్శకంగా ఇసుక లభించేందుకు ఏర్పాట్లు
- 'చెక్ పడేనా' కథనంతో అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ రంగంలోకి దిగారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, అన్నారం, పలుగుల, పూసుకు పల్లి, ముద్దుల పల్లిలలో గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఇసుక రీచ్ లను పరిశీలించారు. ఈ సేవ ద్వారా ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా ఇసుక లభించేందుకు వీలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇసుక కోసం 24/7 ఆన్లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. రీచ్‌లలో ఇసుక తీయడంపై ఆయన సమీక్షించారు. ప్రతి రోజు ఎన్ని టన్నుల ఇసుక తోడుతున్నారు..ఎంత రవాణా జరుగుతోందంటూ టీఎస్ ఎండీసీ, మైనింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### 24/7 ఆన్లైన్ బుకింగ్..

ఈ సందర్భంగా మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. 24/7 ఆన్లైన్ ప్రక్రియ ద్వారా ఇసుక కొరత లేకుండా బుకింగ్ చేయడానికి అవకాశం కల్పించామన్నారు. ఆయా ఏరియాల్లో ఇసుక స్టాకు, గోదావరిలో ఇసుక తీయు విధానాన్ని పరిశీలించారు. స్టాక్ పాయింట్, రీచ్ లకు వచ్చు వాహనాలు, లోడింగ్ తో తికిగి వెలుతున్న వాహనాలపై పటిష్ట నిఘా పెట్టాలన్నారు. అవి ప్రయాణించే మార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొత్తగా సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్తు సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. రోజు వారీ ఎంత ఇసుక రవాణా జరుగుతుందనే వివరాలు అడిగి తెలుసుకున్న మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రస్తుతం ఉన్న ఎనిమిది వేల మెట్రిక్ టన్నులను 10 వేల మెట్రిక్ టన్నులకు పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### పార్కింగ్ స్థలాల ఏర్పాటు..

వాహనాలు నిలుపుదల చేయడం వల్ల రైతులకు, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రవాణాను నియంత్రణ చేసేందుకు వీలుగా ఇసుక స్టాక్ ఏర్పాటుకు అలాగే వాహనాలు నిపుదలకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇసుక కొరత రాకుండా రాష్ట్రవ్యాప్తంగా నూతన ఇసుక రీచ్ లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఇసుక కొరత రాకుండా స్టాక్ నిల్వలు పెంచి అందరికీ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గోదావరి నుంచి ఇసుక తీయటానికి యంత్రాలను పెంచాలని ఆయన సూచించారు. ఇసుక రవాణాకు నిర్దేశించిన సమయం కంటే మరో మూడు గంటలు అదనంగా కేటాయిస్తామన్నారు. దీంతో నిర్దేశించిన లక్ష్యం మేర ఇసుక రవాణ చేయడం సులభతరమవుతుందన్నారు. నిర్దేశించిన స్టాకు ప్రకారం ఇసుక తరలించేందుకు వాహనాలుకు అనుమతి ఇవ్వాలని తెలిపారు. కాంట్రాక్టర్లకు కమిషన్ చెల్లింపులు క్రమం తప్పకుండా చేయాలన్నారు. అదేవిధంగా లోడింగ్, అన్ లోడింగ్ అయిన లారీలు కాంటా వేసేందుకు వీలుగా అదనపు వేయింగ్ మిషన్ లను ఏర్పాటు చేయాల్సి ఉన్నందున ప్రత్యామ్నయంగా ప్రైవేట్ వేయింగ్ మిషన్ ను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

### చర్యలు తీసుకున్నాము..

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఇసుక రవాణా, లభ్యతపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నామని ప్రకటించారు. వాహనాల రద్దీ నియంత్రణకు, నిలిపి ఉంచకుండా వాహనాలు నియంత్రణ చేసేందుకు ఆన్లైన్ బుకింగ్ ప్రకారం క్రమపద్ధతిలో వాహనాలు రీచ్ కు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెకింగ్ పాయింట్ ఏర్పాటు ద్వారా నిశిత పరిశీలన జరుగుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎంఐడీసీ వీసీ అండ్ ఎండి సుశీల్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, టీఎస్ఎం ఐడీసీ పీఓ రంగారెడ్డి, మైనింగ్ ఏడీ జయరాజు, తహసీల్దార్ ప్రహ్లాద రాథోడ్, నాయబ్ తహసీల్దార్ కృష్ణ ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.









## హమాలీ కార్మికుడి కుటుంబానికి పరామర్శ

**వరంగల్ వాయిస్, చిట్యాల :** స్థానిక సివిల్ సప్లయ్ గోదాంలో పనిచేసే హమాలి కార్మికుడు ఆరేపల్లి ఎల్లయ్య మృతి చెందగా వారి కుటుంబాన్ని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.రాములు గురువారం పరామర్శించారు. ఎల్లయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి, ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఆఫీస్ సూపరింటెండెంట్ గంగాధర రాజు, కార్మికులు సరిగోమ్ముల సురేష్, కట్కూరి కుమార్, శీలపాక నాగరాజు తదితరులు ఉన్నారు.

## మత్తు వదిలించాలి

**అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలి**
**కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, దీనిపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ రవీందర్ లతో కలిసి మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లాలోని 16 పీఎంశ్రీ ప్రభుత్వ పాఠశాలల్లో వీటి నిర్వహణకు ప్రణాళికలు రచించాలన్నారు. అవగాహన, చైతన్యం కల్పించడం వల్ల సమాజంలో మార్పు తీసుకు రావచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు గురించి, ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదయ్యాయనే వివరాలను పోలీస్, ఎక్సైజ్, టీఎస్ న్యాబ్, అటవీ, జీఆర్పీ పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ రవీందర్ మాట్లాడుతూ ప్రతి నెల నార్కోటిక్ కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100, సమీప పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చందర్, ఎఫ్ఆర్ఓ సందీప్, నార్కోటిక్స్ డీఎస్పీ సైదులు, డ్రగ్స్ ఇన్ స్పెక్టర్ అరవింద్ కుమార్, టీఎస్ న్యాబ్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### జాతీయ స్థాయి చాంపియన్ షిప్ కు ఎన్నిక..

ఇటీవల హైదరాబాద్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్లైండ్, పారా జూడో చాంపియన్ షిప్ పోటీల్లో వరంగల్ జిల్లా నుంచి తొమ్మిది మంది క్రీడాకారులు బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వరంగల్ జిల్లా యువజన, క్రీడల అధికారి టీవీఎల్ సత్య వాణి ఒక ప్రకటణలో తెలిపారు. ఈ నెల 24నుంచి లక్నో కేడీ సింగ్ బాబు స్టేడియంలో జాతీయ స్థాయి పోటీలు జరుగనున్నట్లు ప్రకటించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జూడో క్రీడాకారులు ఎం.జెషీంత్, జి.రాం చరన్, వి.జీవన్, ఎన్.హరి హరణ్, కె.శ్రీకాంత్, పి.నాగరాజు, జి.సతీష్, జి.వినోద్, జి.గౌతమ్ లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం తన చాంబర్ లో అభినందించారు.

# జిల్లాలో మాదక ద్రవ్యాలను నియంత్రించాలి

- వాటితో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలో మాదక ద్రవ్యాలను నియంత్రించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం ఐడీఓసీలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్, స్థానిక సంస్థల, రెవెన్యూ అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మాచారీ లతో కలిసి సంబంధింత అధికారులతో జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ (ఎన్‌కార్డ్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు పోలీస్ శాఖ కృషి చేస్తోందని, వాటికి ఇతర శాఖలన్నీ సహకారం అందించాలన్నారు. జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టే దిశగా దృష్టి సారించాలని, గంజాయి ఒక సామాజిక దురాచారంగా తయారైందన్నారు. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కళాజాత బృందాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు, వీటిపై అవగాహన కల్పించేందుకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలని, పాఠశాల విద్యార్థులకు ప్రార్థన సమయాలలో పలు సందేశాలతో అవగాహన కల్పించాలని, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతీ పట్టణ మండల, గ్రామ స్థాయిలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కలిసి మాదక ద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేకించి గంజాయి వివిధ మార్గాల ద్వారా రవాణాలో ఉందని, వాటిపై పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు నిఘా పెట్టి నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి ఇతర శాఖలనుండి కూడా సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవోలు కృష్ణవేణి, గణేష్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ లకావత్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్, డ్రగ్ ఇన్ స్పెక్టర్ ఉమారాణి, జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ వెంకట్రాములు, ట్రైబల్ వేల్ఫేర్ డీడీ దేశీరాం, డీఐఈఓ మాదార్, బీసీ డెవలప్ మెంట్ అధికారి నరసింహస్వామి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, ప్రభుత్వ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ లీల, విద్యశాఖ అధికారి శ్రీరాములు, సి.సెక్షన్ సూపరింటెండెంట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## కుల గణనను విజయవంతం చేయాలి



**వరంగల్ వాయిస్, వరంగల్:** రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 16 నుంచి 28 వరకు చేపట్టిన కుల గణన మలి విడతలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ వివరాలు నమోదు చేయాలని బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుడికాల భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ అభివృద్ధి ప్రతి వ్యక్తి అభివృద్ధిపై ఆధారపడిందని, కులాల ఆధారంగా నిర్మితమైన భారతదేశంలో సమానమైన అభివృద్ధి జరగాలంటే కుల గణన కీలకమని పేర్కొన్నారు. గత 78 ఏళ్లుగా ప్రజలు, ముఖ్యంగా బీసీలు, కుల గణనపై న్యాయమైన డిమాండ్ చేస్తున్నారని, 1931 వరకు బ్రిటిష్ ప్రభుత్వం కుల గణన నిర్వహించిందని, కానీ స్వాతంత్రం వచ్చిన తర్వాత కులాల లెక్కలు తేల్చడం నిలిపివేయడంతో బీసీలు విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో అనేక నష్టాలను ఎదుర్కొన్నారని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ చేసిన 12 రోజుల ఆమరణ దీక్ష ఫలితంగా అన్ని పార్టీలు, సంఘాల మద్దతుతో రాష్ట్ర ప్రభుత్వం కుల గణన ప్రక్రియ చేపట్టిందని ఆయన గుర్తు చేశారు. అయితే కొన్ని లోపాల కారణంగా మొదటి విడతలో కుల గణన పూర్తిగా విజయవంతం కాలేదని, అందువల్ల ప్రభుత్వం ఈ నెల 16 నుంచి 28 వరకు మరో అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. కాబట్టి, ఎవరికైతే వివరాలు నమోదు కాలేదో వారు విధిగా పాల్గొని తమ వివరాలు నమోదు చేయాలని, అభివృద్ధి కోసం సహకరించడం ప్రతి పౌరుడి బాధ్యత అని బీసీ ఆజాది ఫెడరేషన్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి జినుకల లక్ష్మణరావు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజవెల్లి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** బీజేపీ పరకాల పట్టణ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అధ్యక్షతన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ బలపరిచిన అభ్యర్థి పులి సర్వోత్తం రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుటకుగాను, పట్టణ ఓటర్స్ సంపర్క్ సమావేశం, బూత్ ప్రభారీ, కన్వీనర్లతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల రాజవీరు, కుక్కల విజయకుమార్, దగ్గు విజేందర్ రావు, బెజ్జంకి పూర్ణ చారి, కొలనుపాక భద్రయ్య, మార్త భిక్షపతి, బాసాని సోమరాజు, సంఘ పురుషోత్త, బండి రవి, మారేడుగోండ భాస్కరాచారి, వేముల సదారాణి, సారంగ నరేష్ పాల్గొన్నారు

# బాలల హక్కులకు భంగం కలిగించొద్దు



**వరంగల్ వాయిస్, వరంగల్:** బాలల హక్కులను కాపాడటంలో సమాజంలోని ప్రతివ్యక్తి బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపెల్లి మధు తెలిపారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం మరియు ఓరుగల్లు హెల్పింగ్ హాండ్స్ బోల్లికుంట సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు పూలా రవి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఆకులపెల్లి మధు మాట్లాడుతూ, పిల్లలకు జీవించే హక్కు, అభివృద్ధి హక్కు, రక్షణ హక్కు, భాగస్వామ్య హక్కు ఉంటాయని పేర్కొన్నారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పని చేయించడమో, 18 ఏళ్ల లోపు పిల్లలను ప్రమాదకరమైన పనుల్లో పెట్టడమో చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎదుగుదలలో ఉన్న వయసులో పిల్లలను పనుల్లో పెట్టడం వల్ల వారి అభివృద్ధి దెబ్బతింటుందని, వారికి సక్రమమైన మార్గదర్శకత్వం ఇవ్వాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు బండ రామలీల మాట్లాడుతూ, కిశోర దశలో అమ్మాయిలు ప్రేమ, ఆకర్షణ పేరుతో మోసపోయే పరిస్థితులు ఎక్కువగా ఉంటున్నాయని, ఇలాంటి పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చైల్డ్ హెల్ప్ లైన్ అవుట్ రీచ్ వర్కర్ సుష్మ మాట్లాడుతూ, బాలలకు ఏదైనా సమస్యలు ఎదురైతే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సహాయం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగ అవుట్ రీచ్ వర్కర్ శ్వేత, ఉపాధ్యాయులు శ్రీధర్, కృష్ణ రెడ్డి, కుమార్, శివాజీ, జయశ్రీ, చందన, పీఈటీ జన్ను బాబు, ఓరుగల్లు హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకుడు మచ్చిక రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ముక్తిస్థల్‌లో శివ కల్యాణం



**వరంగల్ వాయిస్, వరంగల్:** శ్రీ లక్ష్మీ–నారాయణ, శ్రీ శివ–పార్వతుల వటవృక్షం కళ్యాణ మహోత్సవానికి సంబంధించిన గోడ పోస్టర్ ను ఎల్బీ నగర్ హిందూ ముక్తిస్తల్ సేవ సంఘం కార్యవర్గం ఆధ్యర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు బూర రాంచందర్ మాట్లాడుతూ ఈ నెల 25 మంగళవారం ఉదయం 11:16 గంటలకు శ్రీ లక్ష్మీ–నారాయణ, శ్రీ శివ–పార్వతుల వటవృక్షం కళ్యాణ మహోత్సవం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ మహోత్సవానికి నగర భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివపార్వతుల అనుగ్రహం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు, ఉపాధ్యక్షులు గోసికొండ సుధాకర్, ఇప్ప ఆదినారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వంగర భాస్కర్, కోశాధికారి ఉప్పుల రమేష్, సహకోశాధికారి అంబటి అశోక్ కుమార్, సహాయ కార్యదర్శులు ఆకెన వెంకటేశ్వర్లు, గుమలాపురం ఉప్పలయ్య, గాదే ప్రభాకర్, మార్గం ఎల్లయ్య, శీలం బాబూరావు, మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పశు వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పర్వతగిరి మండలంలోని మూడెత్తుల తండా గ్రామంలో గురువారం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోష వ్యాధుల చికిత్స శిబిరం, దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ శిబిరానికి స్థానిక పశువైద్య అధికారి డా.కె రాజు ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడ దూడలు పుట్టే లింగ నిర్ధారణ చేసిన సెక్స్ సార్టెడ్ సేమెన్ అందుబాటులో ఉందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి 76 పశువులు రాగా, 32 ఎదుకు రాని పశువులకు, 26 దూడలకు నట్టల నివారణ మందులు, 4 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు,1 కృత్రిమ గర్భధారణ, 6 సాధారణ చికిత్సలు 7 చూడి పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో ఏరియా గోపాలమిత్ర సూపర్ వైజర్ కరిమిళ్ల రఘువీర్, గోపాలమిత్రులు ఉపేందర్, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, కుమారస్వామి, రైతులు పాల్గొన్నారు.

## జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** నల్గొండ–వరంగల్–ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా బీజేపీ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తం రెడ్డికి ఓటు మొదటి (1) ప్రాధాన్యతకు వేసి గెలిపించాలని కోరుతూ వర్ధన్నపేట మండలం కట్ర్యాల చంద్రు తండా, ఇల్లంద గ్రామాల్లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ముఖ్యఅతిథిగా బీజేపీ వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి హర్షణపల్లి శ్రీ రాంభూపాల్ పాల్గొని ఉపాధ్యాయ ఓటర్లను కలిసి ఓటుని అభ్యర్థించారు. అనంతరం వారు మాట్లాడుతూ పులి సరోత్తం రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా మూడున్నర దశాబ్దాలకు పైగా అనుభవమున్న వారని, ఆది నుంచి ఉపాధ్యాయుల సమస్యల గురించి గళం ఎత్తుతూనే ఉన్నారని, జీఓ నెంబర్ 317 వలన ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పోరాడారన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి, ఉపాధ్యాయుల సమస్యలను అర్థం చేసుకొని, సమస్యల పరిష్కారానికై పోరాడిన వారిలో సరోత్తం రెడ్డి ముఖ్యులని పేర్కొన్నారు.

# యూరియా సరఫరాలో అధికారులు విఫలం

■ సీపీఐఎంఎల్ మాస్ లైన్ నేత రవి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** యాసంగి పంటకి వరి రైతులకు అవసరమగు యూరియాను సరఫరా చేయటంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ తొర్రూరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం తొర్రూర్ ఆర్డీవో ఆఫీసులో నిరసన తెలియజేసి అనంతరం వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వరి రైతులు యూరియా అందక రోజులకొద్దీ పడిగాపులు పడుతుంటే వ్యవసాయ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. యాసంగి వరి సాగు భూమి లెక్కలు జిల్లా వ్యవసాయ అధికారి వద్ద లేవా అని ప్రశ్నించారు. ముందస్తు ప్రణాళికతో కావలసిన యూరియా తెప్పించటంలో విఫలమైన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని రవి డిమాండ్ చేశారు. ఒక్క తొర్రూరు మండలంలోనే 3000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటే కేవలం 1500 టన్నుల యూరియాను తెప్పించటం ఆ శాఖ అధికారుల బాధ్యత రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. యుద్ధ ప్రాతిపదికన యూరియాను రైతులకు అందించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న మాట్లాడుతూ యూరియా కృత్రిమ కొరతను సృష్టించాలని చూస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ తొర్రూరు సంయుక్త మండలాల సహాయ కార్యదర్శి సెగ్గెం యాకయ్య, అఖిల భారత ఐక్య రైతు సంఘం డివిజన్ నాయకులు గద్దల వెంకటయ్య, గజ్జి యాకయ్య, మంచె ఐలయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. స్పందించిన జూనియర్ అసిస్టెంట్ యూరియాను పంపిస్తానని హామీ ఇచ్చారు.

## ప్రమాదవశాత్తు గీత కార్మికుడి మృతి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముంజాల స్వామి (48) తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. బుధవారం సాయంత్రం వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మృతిచెందారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని రాష్ట్ర గీత కార్మిక సంఘం ఉపాధ్యక్షులు ఏకాంతం గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

## ఛత్రపతి శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం



**వరంగల్ వాయిస్, వరంగల్:** మరాఠా యోధుడు, మహారాష్ట్ర సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ జీవితం స్ఫూర్తిదాయకని శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఆయన స్ఫూర్తితో ఫిబ్రవరి 19న శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 12వ డివిజన్‌కి సంబంధించిన వివిధ కూడళ్లలో శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు సంగీత్ అధ్యక్షతన అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో 12,13, 22, 23వ డివిజన్లకు చెందిన మేరుగు సాంబయ్య, కందికట్ల విజయ్, కూరపాటి సంపత్, బూర రాము, పెంట కొమురయ్య, రాపోలు సతీష్, కూచన సదానందం, కూచన ఓదెలు, మేరుగు శ్రీరాములు, కందికట్ల రమేష్, వలకట్ల కేశవులు, పెరుక సుధాకర్, ఎస్ డీ సమ్మద్, క్యాతం శివ, పిండి శివ, జక్కులు సమ్మయ్య, ముంద్రాతి వెంకటేశ్వర్లు, వంగ సంపత్, ధర్మపురి రామారావు, ఆదేపు దేవేందర్, బండారి శ్రీనివాస్ రెడ్డి, గొలుసుల సదానందం, తాళ్లూరి వినోద్, తిప్పర్తి కృష్ణ, చిలువేరు నరేష్ బృందం, భీమనాదుల సాయి బృందం, సాదం సాయి బృందం, కందికట్ల వసంత్ బృందం పాల్గొన్నారు.

## సాధన హైస్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సాధన హై స్కూల్ ప్రాంగణంలో స్కూల్ కరస్పాండెంట్ కూరపాటి విజయలక్ష్మి, చైర్మన్ కం ప్రిన్సిపాల్, వరంగల్ జోన్ కోశాధికారి కూరపాటి మోహన్ ఆధ్వర్యంలో గురువారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు 160 రకాల ఆహార పదార్థాలను స్వయంగా తమ ఇళ్లలో తయారు చేసి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌లో ప్రదర్శించారు. సందర్శకులుగా వచ్చిన 350 మంది తల్లిదండ్రులు, ప్రేక్షకులకు ఆహార పదార్థాల విశిష్టతను, వాటి పోషకతను సవివరంగా వివరించారు. విద్యార్థులు తాము తయారు చేసిన ఆహార పదార్థాలను విక్రయిస్తూ సందడి చేశారు. ముఖ్య అతిథులుగా వరంగల్ జిల్లా గౌరవ సలహాదారులు ఆదెపు శ్యాం, కోడం శ్రీధర్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, వడుప్సా వరంగల్ జిల్లా కార్యదర్శి బిల్లా రవి, కోశాధికారి ఠాకూర్ జ్ఞానేశ్వర్ సింగ్, వరంగల్ జోన్ కార్యదర్శి శ్రీనివాస్ హాజరయ్యారు. సాయి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ అనిల్, కేతన్ కాన్వెంట్ స్కూల్ కరస్పాండెంట్ కం ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వీనస హైస్కూల్ చింతల్ కరస్పాండెంట్ బాలవారి పవిత్ర తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. తల్లిదండ్రులు, స్కూల్ టీచర్లు ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో కీలక పాత్ర వహించారు.

## హాస్పిటల్స్‌లో డిప్యూటీ డీఎంహెచ్ఓ తనిఖీలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని నిక్కా హెల్త్ కేర్ సెంటర్, వెంకటేశ్వర నర్సింగ్ హోంలలో గురువారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రమీల తనిఖీ చేశారు. హాస్పిటల్ రికార్డ్స్ ను పరిశీలించి, ఇన్ పేషెంట్స్ వివరాలను, రిజిస్టర్ ఔట్ పేషెంట్స్ రిజిస్టర్, పేషెంట్ కు అందిస్తున్న సేవలను గురించి, ల్యాబ్ పరీక్షల అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ కెవి రాజు, గీత పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ మత్స్య పారిశ్రామిక సంఘం చైర్మన్ భయ్యా తిరుపతి కుటుంబానికి మాజీ కార్పొరేటర్ భయ్యా స్వామి, ఆత్మకూరు మత్స్య పారిశ్రామిక సంఘం చైర్మన్ గుండెబోయిన భిక్షపతి ఆధ్వర్యంలో రూ.20వేలను గురువారం అందజేశారు. తిరుపతి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని స్వామి భరోసా కల్పించారు. కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు బయ్య కుమారస్వామి, (మెంబర్ ) భాష పోయిన సాగర్, వీర్ల శ్యామ్, బయ్య శ్రీనివాస్ భయ్యా కుమార్, కుమారస్వామి, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న సత్యనారాయణ గౌడ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని గురువారం టీఎన్జీఓ భాగ్యనగర్ హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ సొసైటీ పాలకవర్గంతో కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ హనుమకొండ అధ్యక్షులు ఆకుల రాజేందర్, సెక్రెటరీ బైరి సోమయ్య టీఎన్జీఓ కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలికి పరామర్శ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల పరిధిలోని కల్లెడ గ్రామానికి చెందిన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముదురుకోళ్ల రమేష్ తల్లి ముదురుకోళ్ల లచ్చమ్మ అనారోగ్యంతో హనుమకొండలోని ఏకశిలా (మాక్స్ కేర్)ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా గురువారం ఆమెను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శించి మనోధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు తో పాటు తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్యే మురళి నాయక్ కృషితో ఔటర్ రింగురోడ్డు

మారనున్న మానుకోట రూపరేఖలు

కాంగ్రెస్ నేత శంతన్ రామరాజు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** స్థానిక ఎమ్మెల్యే మురళీ నాయక్ కృషితో ఔటర్ రింగురోడ్డు నిర్మాణం కానుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శంతన్ రామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. రూ.125కోట్ల వ్యయంతో 10.05కి.మీ. రోడ్డును నిర్మాణం జరగనుందని పేర్కొన్నారు. దీంతో దినదినాభివృద్ధి చెందుతున్న మానుకోట ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ పనిచేస్తున్నారన్నారని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలోనే వేగంగా వృద్ధిచెందుతూ ప్రముఖ వాణిజ్య, విద్యా, పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న మానుకోటలో కొత్త రహదారుల నిర్మాణంపట్ల ఎమ్మెల్యే కృషిని ప్రజలు కొనియాడుతున్నారన్నారు. గెలిచిన సంవత్సర కాలంలోనే రూ.370కోట్ల నిధులతో మానుకోటను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత ప్రజానాయకుడు మురళీ నాయక్ దేనని అన్నారు. నిరంతరం రాష్ట్ర మంత్రులూ, ముఖ్యమంత్రిని కలుస్తూ మానుకోట అభివృద్ధికై కొట్లాడి అత్యధిక నిధులు తెస్తున్న మురళీ నాయక్ నియోజకవర్గంలోని మౌలిక సదుపాయాల కల్పనలో ముందున్నాడన్నారు. వచ్చే నాలుగేండ్ల పాటు నియోజకవర్గాన్ని తెలంగాణ ఐకాన్ గా మార్చే విజన్ తో ముందుకెళ్తున్న మురళీ నాయక్ కు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ కార్యకర్తలకు, పార్టీ శ్రేణులకు నేనున్నానంటూ భరోసా ఇస్తున్న మురళీ నాయక్ చరిత్రలో నిలిచిపోతాడన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూస్తున్న జనం వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలను తుడ్చిపెట్టేస్తారని ఆకాంక్షించారు.

# విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన సదస్సు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని లష్కర్ బజార్ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్ లో ఉదయం ప్రార్థన సమయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 1000 మంది విద్యార్థులు ప్రార్థనలో పాల్గొనగా ధూమపానం, మద్యం, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. వరంగల్ నార్కోటిక్స్ ఎన్ ఫోర్స్ మెంట్ వింగ్ ఇన్ స్పెక్టర్ బి.రవీందర్, సబ్ ఇన్ స్పెక్టర్ (ఎస్ఐ) సాయిలు, ఇతర సిబ్బంది విద్యార్థులకు ప్రాక్టికల్ గా కసరత్తులు చేసి చూపించారు. 'నో స్మోకింగ్, నో ఆల్కహాల్, నో డ్రగ్స్' అంటూ నినాదాలు చేశారు. సీఐ రవీందర్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో డ్రగ్స్ పొగతాగడం లేదా పాఠశాల ఆవరణలో అక్రమంగా గంజాయి అమ్మడం వంటివి జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. గంజాయి అక్రమ విక్రయాలపై విద్యార్థులు పోలీసులకు లేదా పాఠశాల సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. అలాంటి వారిపై మేము ఫిర్యాదు అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఎటువంటి పరిస్థితుల్లోనైనా వారిని అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ పిల్లలను, పాఠశాల విద్యార్థులను డ్రగ్స్‌కు దూరంగా ఉంచాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్‌ను



అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు తీసుకుంటోందని రవీందర్ తెలిపారు. వరంగల్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ దాని కోసం కృషి చేస్తోందని అదేవిధంగా, మాదక ద్రవ్యాల వాడకాన్ని నివారించేందుకు, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం మేము కింది స్థాయి నుంచి అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక పోస్టర్లను ప్రభుత్వ ప్రాక్టీస్ హైస్కూల్ ఇంచార్జి హెడ్‌మాస్టర్ జగన్నాధం, చిన్నారులు విడుదల చేశారు. పోస్టర్లు గోడలపై ప్రదర్శించాలని ఇది పిల్లలకు సహాయం చేస్తుందన్నారు.

# పులి సరోత్తం రెడ్డిని గెలిపించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** వరంగల్ -ఖమ్మం- నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎలక్షన్స్ లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గడ్డం అశోక్ ఆధ్వర్యంలో మానుకోట జిల్లా కేంద్రంలోని స్థానిక నలంద కాలేజ్ యాజమాన్యం, తెలంగాణ ఉద్యమకారుడు డోలి సత్యనారాయణను, ఉపాధ్యాయులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మానుకోట బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభూ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఒద్దిరాజు రామచంద్ర రావు, యాప సీతయ్య, బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళి, బీజేపీ జిల్లా నాయకురాలు ఓర్సు పద్మావతి, ఎంపీటీసీ పాపారావు, జిల్లా కార్యదర్శి చిట్టిమల్ల శ్రీనివాస్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్, పట్టణ ప్రధాన కార్యదర్శిలు పల్లె సందీప్, వెన్నమల్ల సందీప్, యువ మోర్చా నాయకులు వీరమల్ల ప్రేమ్ కుమార్, గిరిజన మోర్చా నాయకులు నరేష్ నాయక్, కోటి నాయక్, సుధాకర్ నాయక్, యువమోర్చా జిల్లా నాయకులు గువ్వా శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత

➲ ప్రముఖ సినీ మ్యూజిక్ డైరెక్టర్ బోలే

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జీవితం జీవించడానికే, ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని ప్రముఖ సినీ మ్యూజిక్ డైరెక్టర్ బోలే పేర్కొన్నారు. ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనుటకై మానుకోటకు వచ్చిన ప్రముఖ సినీ సంగీత దర్శకుడు బోలె, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మహత్యల నివారణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోలే మాట్లాడుతూ ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తుల పట్ల, సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలని, తనకి ఎవరూ లేరనే అగాధాన్ని పూడ్చే ప్రయత్నంతో భరోసా నింపాలని, కష్టాల్లో ఉన్న వ్యక్తికి తనకు ఉన్న అన్ని దారులు మూసుకుపోయినప్పుడు, ఆత్మహత్య ప్రయత్నం అనే దారి తెరుచుకుంటుందని, ఆ ప్రమాదకర క్షణంలో మేమున్నామంటూ భరోసానిస్తే బయటపడతారని తెలిపారు. గత పది సంవత్సరాలుగా ఆత్మహత్యల నివారణకు



కృషి చేస్తూ ఇప్పటివరకు 28మందిని డాక్టర్ అశోక్ కాపాడటం అభినందనీయమనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్, ఎన్ఎస్ఎస్ అధికారి కూతురు సత్యనారాయణ, సీపీఎం. రాష్ట్ర నాయకులు సాదుల శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శాంతన్ రామరాజు, బీజేపీ రాష్ట్ర నాయకులు బాలు నాయక్, మునుకుంట్ల ఐలేశ్, ప్రభుత్వ కళాబృందం సభ్యులు భరత్, రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



➲ స్కూల్ బస్సు బ్రేక్ డౌన్
➲ తోయలేక విద్యార్థుల పరేషాన్

# బండి కాదు.. మహా మొండి

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** విద్యార్థులు ప్రయాణిస్తున్న ప్రైవేట్ పాఠశాల బస్సు మార్గం మధ్యలో రహదారిపై మొరాయించడంతో బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులను కిందకు దింపి వారి చేత బస్సును నెట్టించిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది పట్టణంలోని గాదె రుక్మారెడ్డి ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలకు తీసుకువస్తున్న క్రమంలో మార్గం మధ్యలో రహదారిపై బస్సు మొరాయించడంతో విద్యార్థులతో నెట్టించారని పాఠశాల యాజమాన్యంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్సులకు ఫిట్ నెస్ పరీక్షలు నిర్వహించకుండానే యధేచ్ఛగా రహదారులపై తిప్పుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల బస్సుల ఫిట్ నెస్ పరీక్షలు రవాణా శాఖ అధికారులు నామమాత్రంగా చేపట్టడంతో బస్సులు మొరాయిస్తున్నాయని విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. పాఠశాల బస్సులకు ప్రతి సంవత్సరం తూతూ మంత్రంగా ఫిట్నెస్ పరీక్షలు నిర్వహిస్తుండటంతోనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం ఎంత ముఖ్యమో భద్రంగా ఇంటికి చేర్చడం అంతే ప్రధానంగా ఉండేలా రవాణాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. .

# నర్సంపేటలో కంటి పరీక్షలు పూర్తి

## త్వరలో కళ్లజోళ్లు పంపిణీ



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లోని ఆరు మండలాల్లో ఆర్బీఎస్కే రెండు బృందాలు కలిసి గత ఏడాది 300 మంది విద్యార్థులకు కళ్లజోళ్ల అవసరం ఉందని గుర్తించారు. వీరికి మరింత నిర్ధారణ చేయడానికి రీ-స్క్రీనింగ్, కంటి పరీక్షలు నర్సంపేట గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో కంటి స్పెషలిస్టు డాక్టర్ల ఆధ్వర్యంలో కంప్యూటర్ పరీక్ష (ఏఆర్) నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 17 నుంచి నర్సంపేట ప్రభుత్వాస్పత్రిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇప్పటివరకు సుమారు 140 మంది విద్యార్థులకు పరీక్షలు పూర్తి చేశారు. గురువారం నాటికి అవసరమైన అద్దాలకు ఆర్డర్ పెట్టినట్టు వెల్లడించారు. నేషనల్ హెల్త్ మిషన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని వివిధ వైద్యాధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ హెచ్ఓడీ డాక్టర్ గిరిధర్ రెడ్డి, ఆప్తాల్మిక్ ఆఫీసర్ రాజేందర్, డాక్టర్ శివశ్రీ, పీజీ డాక్టర్లు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవి ప్రకాష్ పాల్గొన్నారు. ఆర్బీఎస్కే బృందంలో డాక్టర్ రవీందర్, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ భవిత, డాక్టర్ మృదుల, అన్నపూర్ణ, ఫార్మసిస్టు స్మిత, దివ్య, జులేక తదితరులు సహకారం అందించారు. అవసరమైన వారికి తెలంగాణ ప్రభుత్వం త్వరలో కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

# ఉద్రిక్తల నడుమ భూ సర్వే



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** వలిగొండ-భద్రాచలం ఎన్ హెచ్ పి-930 జాతీయ రహదారికి సర్వేను భారీ పోలీస్ బందోబస్తు నడుమ అధికారులు నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్ర శివారు ఇల్లందు రోడ్డులో ఉదయం 5గంటల నుంచే అధికారులు సర్వే ప్రారంబించారు. వలిగొండ-భద్రాచలం జాతీయ రహదారి పి-930 అలైన్ మెంట్ మార్చాలంటూ గత కొద్ది రోజులుగా భూ నిర్వాసితులు సర్వే అధికారులను అడ్డుకొని ఆందోళన చేస్తున్నారు. వందలాది మంది పోలీసులు, రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులు చేరుకొని భూనిర్వాసితులను అడ్డుకొని అధికారులు సర్వే చేస్తున్నారు. దీంతో భూనిర్వాసితులు ఆందోళనలో మునిగిపోయారు.

# జబర్తస్త్ ఫేమ్ రాజమౌళికి ఘన సత్కారం

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సినీ వినీలాకాశంలో మహబూబాబాద్ కళాకారులు విశేషంగా రాణిస్తున్నారని, ఉత్తమ ప్రతిభ కనబరిచే నూతన కళాకారులకు సినీ అవకాశాలు కల్పిస్తామని సంగీత దర్శకుడు, గేయ రచయత బోలే శావలి అన్నారు. న్యూ లైఫ్ థియోలాజికల్ యూనివర్సిటీ వారిచే డాక్టరేట్ పురస్కార గ్రహీత జబర్దస్త్ ఫేమ్, సినీ నటుడు రాజమౌళిని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో ఆత్మీయంగా గజ మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బోలె షావలి మాట్లాడుతూ రాజమౌళి సకల కళా సౌరబుడని, అంతర్జాతీయ స్థాయిలో వేల ప్రదర్శనలు చేసిన సేవలకు డాక్టరేట్ లభించిందన్నారు. తాను నటించిన బోలె హీరో చిత్రం వచ్చే దసరాకు, జానపద సినిమా చిత్రం సంక్రాంతికి సందడి చేయనున్నాయన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు, కళాకారులు, కళాపోషకులు పాల్గొన్నారు.

# పోస్టల్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

- లేకుంటే మార్చి 18 నుంచి దేశవ్యాప్త సమ్మె
- రాష్ట్ర అధ్యక్షులు ఉకంటి మహేందర్



**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** పోస్టల్ చట్టం 2023 ఉపసంహరించుకోకపోతే ప్రజల మద్దతుతో పోస్టల్ సమ్మె ఉధృతం చేస్తామని రాష్ట్ర అధ్యక్షుడు ఉకంటి మహేందర్ హెచ్చరించారు. కేంద్ర పోస్టల్ జాయింట్ కౌన్సిల్ అఫ్ యాక్షన్ నిర్ణయం మేరకు దశల వారి పోరాటంలో భాగంగా ఫిబ్రవరి 18 నుంచి 20 వరకు మూడు రోజుల పాటు డిమాండ్లు నెరవేర్చాలని నల్ల బ్యాడ్జిలను ధరించి దేశవ్యాపితంగా పోస్టల్ ఉద్యోగులు నిరసన తెలుపుతూ విధులకు హాజరు కావడం జరిగింది. మూడో రోజు నిరసన కార్యక్రమంలో హుజురాబాద్ ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట పోస్టల్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జ్ లను ధరించి తమ న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం గ్రూప్-సీ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ మహేందర్ మాట్లాడుతూ పోస్టల్ చట్టం 2023 వల్ల పోస్టల్ సేవలు ప్రైవేట్-కార్పొరేట్ పరం కానున్నాయని, పోస్టల్ చట్టం 2023 సెక్షన్ 9, సెక్షన్-10 ప్రకారం ప్రజల గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. . ఈ కార్యక్రమంలో గ్రూప్ సి బ్రాంచ్ కార్యదర్శి జక్కు రజనీకాంత్, మాజీ కార్యదర్శి చందనాల గోపి కిషన్, బత్తిని రాజకుమార్, చిలుకమారి ప్రవీణ్, కోలా సందీప్, సామల వేణుగోపాల్, శివసింగ్, గ్రూప్- డి డివిజన్ కార్యదర్శి బానోత్ తిరుపతి నాయక్, సంకటి హరీష్, గ్రామీణ డాక సేవక్ నాయకులు సతీష్, స్వామి, రాజేష్, శివాజీ, అపూర్వ పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం హర్షనీయం

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు రాష్ట్రం నుంచి రాజకీయ పార్టీల, బీసీ సంఘాల ప్రతినిధులతో కూడిన అఖిలపక్షాన్ని మార్చి 10న ఢిల్లీకి తీసుకెళ్లాలని నిర్ణయించడం పట్ల బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు హర్షం వ్యక్తం చేశారు. మార్చి ఐదు లోపు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న శాసనసభ సమావేశాలలో జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లతో పాటు, బీసీలకు విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేసి కేంద్రప్రభుత్వానికి పంపించాలన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ఆమోదించి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చేందుకై ఒత్తిడి తెచ్చేందుకు అన్ని జాతీయ, ప్రాంతీయ, రాజకీయ పార్టీల నాయకులతో ముఖ్యమంత్రి మాట్లాడి వారందరి మద్దతును సహకారాన్ని తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీల నాయకులు బీసీల డిమాండ్స్ కు మద్దతు తెలిపి సహకరించాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు. బీసీల రిజర్వేషన్ల, ఇతర న్యాయమైన డిమాండ్ల విషయంలో సానుకూలంగా స్పందించక కుంటి సాకులతో బీసీలకు ద్రోహంచేయ తలపెడితే ఆ పార్టీలు తెలంగాణలో మనుగడ కోల్పోతాయని, బతికి బట్ట కట్టలేవని ఆయన హెచ్చరించారు.


# జాతీయ సెమినార్‌కు ముఖ్య ఉపన్యాసకులుగా ప్రొఫెసర్ జి.హరగోపాల్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మార్చి 21, 22 తేదీలలో "భారతీయ సమాజంలో సంకీర్ణ రాజకీయాలు, సామాజిక పరిస్థితి"అనే అంశంపై జరిగే జాతీయ సెమినార్ ప్రారంభ సమావేశానికి ముఖ్య ఉపన్యాసకులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ ను ఆహ్వానించినట్లుగా కేయూ రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. గురువారం హైదరాబాదులో ప్రొఫెసర్ జి.హరగోపాల్ వద్దకు వెళ్లి ఆహ్వాన బ్రోచర్ అందజేశారు. ప్రొఫెసర్ జి.హర గోపాల్ తప్పకుండా జాతీయ సెమినార్ కు హాజరవుతానని చెప్పారని డాక్టర్ సంకినేని వెంకట్ పేర్కొన్నారు. ఈ ఆహ్వాన పత్రిక అందజేసిన కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ వడ్డకొండ సత్యనారాయణ, డాక్టర్ వాడపల్లి నాగరాజు, రీసెర్చ్ స్కాలర్స్ అంకెళ్ల శంకర్, కలిపికొండ వినోద్ తదితరులు ఉన్నారు.

# మహాశివరాత్రికి అన్ని ఏర్పాటు చేయాలి

## భూపాలపల్లి కలెక్టర్ రాహుల్



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జిల్లా కేంద్రంలో మహా శివారాత్రి వేడుకల్లో అన్ని ఆలయాలను దృష్టిలో పెట్టుకొని అవసరమైన అందించేలా చూడాలని కలెక్టర్ రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా 26న వచ్చే శివరాత్రికి కాళేశ్వరం ముక్తీశ్వర దేవాలయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనసున్నారని చెప్పారు. దేవాదాయ శాఖ, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, వైద్య, ఇరిగేషన్, విద్యుత్, ఎక్సైజ్, ఆర్టీసీ శాఖలకు పలు సూచనలు చేశారు.

# ఇద్దరు దొంగల అరెస్ట్

## రూ.17 లక్షల బంగారం స్వాధీనం



**వరంగల్ వాయిస్, కాజీపేట :** మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అయోధ్య పురం రైల్వే గేట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా సంచరించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారిని వివరాలు అడగగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో తనిఖీ చేయడంతో రెండు కవర్లలో సుమారు 240 గ్రాముల బంగారం లభించింది. వారిని అదుపులోకి తీసుకుని ఇద్దరు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న బంగారం విలువ రూ.17 లక్షలు ఉంటుందని నిర్ధారించారు. అలాగే, నిందితుల వద్ద నుంచి రూ.8,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు తమ పేర్లు బానోత్ ఉదయ్, బిర్రు ప్రణీత్ అని వెల్లడించారు. వారు ఈ నెల 12న రాజీవ్ గృహ కల్ప, ఇందిరమ్మ కాలనీ, కడిపికొండలో నివసించే కోట శ్రీనివాస్ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డామని అంగీకరించారు. ఈ ఆపరేషన్‌లో కాజీపేట ఏసీపీ తిరుమల్, మడికొండ ఇన్ స్పెక్టర్ పి.కిషన్, కాజీపేట ఇన్ స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ధర్మసాగర్ ఇన్ స్పెక్టర్ ప్రవీణ్, కమలాపూర్ ఇన్ స్పెక్టర్ హరికృష్ణ, వంగర సబ్-ఇన్స్పెక్టర్ దివ్య, మడికొండ సబ్-ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు రామ్ చందర్, రామనాధం, కానిస్టేబుళ్లు రాకేష్, నాగరాజు ప్రతిభ చూపించగా వారిని సెంట్రల్ జోన్ డీసీపీ షైక్ సలీమా, వరంగల్ కమిషనర్ సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

# తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించండి

## బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్వని తానాజీ వాకడే



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తడి, పొడి చెత్తను వేరు వేరుగా అందించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్-2024 అవగాహన కార్యక్రమంలో భాగంగా 56వ డివిజన్ గోపాల్ పూర్ లో తడి, పొడి చెత్తను వేరు చేసి అందించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై శానిటరీ సిబ్బందికి శిక్షణ తదితర అంశాల అవగాహన కోసం గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమగ్ర శానిటేషన్ నిర్వహణలో భాగంగా తడి, పొడి చెత్తను అందజేయడం, సేకరించడంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి చైతన్యం కలిగించాలన్నారు. తడి, పొడి చెత్తను కలిపి అందించడం వల్ల కలిగే దుష్పభావాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. రిసోర్స్ పర్సన్ లు వారి పరిధిలోగల నివాస గృహాల ప్రజలకు తడి చెత్త ద్వారా కంపోస్టు తయారీ విధానాన్ని వివరించి ప్రోత్సహించడం ద్వారా పరోక్షంగా డంప్ యార్డులకు చేరే తడి చెత్త పరిమాణాన్ని తగ్గించ వచ్చునని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, టీఏంసీ రమేష్, సూపర్వైజర్లు నరేందర్, భాస్కర్, వావ్ ప్రతినిధి పవన్,

# మార్చి 17లోగా మిల్లింగ్ ప్రక్రియ పూర్తి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- పౌర సరఫరాల అధికారులు, మిల్లర్లతో సమీక్ష



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రబీ 2023-24 సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియ వచ్చే మార్చి 17 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రబి 2024- 25 ధాన్యం సేకరణ, 2023-24 సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సత్య శారద పౌర సరఫరాల అధికారులు, సంస్థ మేనేజర్, మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024 -25 రబి సీజన్ లో 2.10 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా ఉందని, ధాన్యాన్ని సేకరించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 2023-24 ఖరీఫ్ సీఎంఆర్ 100శాతం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు గోదాంలో ధాన్యం నిల్వలను పరిశీలిస్తూ ఉండాలన్నారు. రైస్ మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారెంటీ పత్రాలను తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థనుంచి సరఫరా అవుతున్న బియ్యం దుర్వినియోగం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇంకా బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వని మిల్లర్లు వెంటనే సమర్పించాలన్నారు. సీఎంఆర్ బియ్యం డెలివరీ సమయంలో బఫర్ గోడౌన్ ల వద్ద టెక్నికల్ అసిస్టెంట్ల కొరత వల్ల లారీలు ఆగుతున్నాయని, టెక్నికల్ అసిస్టెంట్లను కేటాయించాలని మిల్లర్లు కలెక్టర్ ను కోరగా, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ కు ప్రతిపాదనలు పంపడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, డీపీఓ అనురాధ, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ సంధ్యారాణి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి నీరజ, ఆర్డీఓ ఉమారాణి, మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు, మిల్లర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఆ సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా..

పింక్' చిత్రంలో ఫాలక్ అలీ పాత్రలో నటించి ప్రేక్షకులకు చేరువయ్యారు నటి కీర్తి కుల్హారి. ఆ సినిమా సమయంలో తాను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. షూటింగ్, ప్రమోషన్స్‌లో ఎవరూ తనకు సరైన విలువ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమితాబ్ బచ్చన్ తర్వాత ఆ సినిమాలో విశేషమైన ఆదరణను సొంతం చేసుకున్న వ్యక్తి తాప్సీ మాత్రమేనని అన్నారు. " ఇండస్ట్రీలో చిన్నా, పెద్దా తేడాలు ఉండవని నటీనటులందరినీ ఒకేలా చూస్తారనే అభిప్రాయం నాది. గతంలో నేను వర్క్ చేసిన సినిమాల్లో అలాంటి బేధాభిప్రాయాలు ఎక్కడా చూడలేదు. ఆ సినిమా సెట్స్‌లో అందరూ కలసికట్టుగా ఉండేవాళ్లం. 'పింక్' చిత్రం చిత్రీకరణ సమయంలో నేను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా. ఇండస్ట్రీలో పరిస్థితులు ఎలా ఉంటాయో అప్పుడే అర్థం చేసుకున్నా. సినిమా ట్రైలర్ విడుదలైనప్పుడు చూసి ఎంతో బాధపడ్డా. ఎందుకంటే, అందులో మొత్తం సీన్స్ అమితాబ్, తాప్సీవే ఉన్నాయి. సినిమా కోసం నేను ఎంతలా వర్క్ చేశానో తెలుసని నాకు నేను సర్దిచెప్పుకున్నా.

# అల్లుఅర్జున్‌కు మరో ఘనత

## ఏకంగా హాలీవుడ్ కవర్ పేజీలో బన్నీ ఫొటో




ఐకాన్‌స్టార్ అల్లు అర్జున 'పుష్ప' చిత్రంతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. సుకుమార్ దర్శకత్వం మాస్ మసాలా యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు హాలీవుడ్‌ను సైతం ఆకర్షించింది. తెలుగు సినిమాకు ఉత్తమ నటుడిగా నేషనల్ అవార్డు తీసుకొచ్చిన బన్నీ ఇప్పుడు మరో ఘనతను తన సొంతం చేసుకున్నారు. ప్రముఖ సినిమా మ్యాగజైన్ 'ది హాలీవుడ్ రిపోర్టర్' ఇప్పుడు 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' పేరుతో భారత్‌లోనూ అడుగుపెట్టేసింది. ఈ మ్యాగజైన్ తొలి సంచిక అల్లు అర్జున్ ఫొటోతో రానుంది. తాజాగా ఈ కవర్ పేజ్ ఫొటో షూట్‌ను నిర్వహించారు. ఆ బీటీఎస్ ప్రోమో వీడియోను తాజాగా షేర్ చేశారు. అందులో అల్లు అర్జున్ పంచుకున్న కొన్ని విషయాలను చూపించారు. 'సినిమాకు హద్దులు లేవని నిరూపించిన స్టార్ అల్లు అర్జున్: ది రూల్'' పేరుతో ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియాలో ఇంటర్వ్యూ రానుంది. ఇందులో అల్లు అర్జున్ ఇప్పటివరకు సాధించిన విజయాలను వివరించనున్నారు. నా జీవితంలో లభించిన అతిపెద్ద అవకాశం ఇదే అని భావిస్తున్నా. బలం, ఆత్మవిశ్వాసం అనేవి మనసులో ఉంటాయి. ప్రతి మనిషికి కొన్ని లక్షణాలు పుట్టుకతో వస్తాయి. ఇది అలాంటిదే. విజయం తర్వాత కూడా వినయంగా ఉండటం చాలా ముఖ్యం. జీవితంలో సక్సెస్ అయిన తర్వాత కూడా ఎలాంటి గర్వం లేని చాలా మందిని నేను చూశా. అది వారి వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటుంది. ఇకపోతే నేను 100 శాతం సామాన్యుడిని. సినిమా చూస్తున్నప్పుడు కూడా ఇదే భావనతో ఉంటాను. అలాగే విరామ సమయంలో కేవలం విశ్రాంతి మాత్రమే తీసుకుంటాను. ఏమీ చేయకుండా ఉండటమే నాకిష్టం. కనీసం పుస్తకం కూడా చదవను'' అని ఆ ఇంటర్వ్యూలో అల్లు అర్జున్ వివరించారు. ఈ ఇంటర్వ్యూలో బన్నీ ఇంకేం చెప్పుకొచ్చాడా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఆసక్తిరేపుతున్న ఓదెల-2

టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం ఓదెల 2. సంపత్ నంది ప్రొడక్షన్ హౌజ్ నుంచి వస్తోన్న ఈ చిత్రానికి అశోక్ తేజ దర్శకత్వం వహిస్తున్నాడు. ఓం నమ: శివాయ.. అంటూ తమన్నా శివశక్తి లుక్ ఇప్పటికే నెట్టింట పోస్టర్లు వైరల్ అవుతున్నాయని తెలిసిందే. ఈ చిత్రంలో తమన్నా మహదేవ్‌కు పరమభక్తురాలిగా, ఓదెల సద్గుణ రక్షకురాలిగా కనిపించనుంది. చాలా రోజుల తర్వాత ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్‌ను షేర్ చేశారు మేకర్స్. ఈ సినిమా ఖాతాలో అరుదైన ఫీట్ చేరనుంది. ఓదెల 2 టీజర్‌ను ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ్ మేళాలో ఫిబ్రవరి 22న లాంచ్ చేయనున్నారు. ప్రఖ్యాత పుణ్యక్షేత్రంలో టీజర్ లాంచ్ చేసుకోబోతున్న తొలి ఇండియన్ సినిమాగా చరిత్రలో నిలిచిపోనుంది. ఈ లాంచ్ ఈవెంట్‌కు చిత్రయూనిట్, మేకర్స్ హాజరుకానున్నారు. మొత్తానికి దేశమంతా మహాకుంభ్ మేళావైపు చూస్తున్న నేపథ్యంలో అక్కడే టీజర్ లాంచ్ సినిమాపై అందరి అటెన్షన్‌ను తమవైపునకు తిప్పుకుంటోంది. ఈ చిత్రంలో వశిష్ఠ ఎన్ సింహా, హరిప్రియ ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని సంపత్ నంది టీమ్ వర్క్స్ బ్యానర్, మధు క్రియేషన్స్‌పై తెరకెక్కిస్తున్నారు. కాంతార ఫేం అజనీష్ లోక్‌నాథ్ ఈ మూవీకి మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండటంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఓదెల 2 కోసం తమన్నా శివశక్తి రూపంలోకి ఎలా మారిందని తెలియజేస్తూ మేకింగ్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్.



# పూర్తయిన వార్-2 షూటింగ్

## ఆగస్టు 25న ప్రేక్షకుల ముందుకు..



బాలీవుడ్ కథానాయకుడు హృతిక్ రోషన్ , టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రానున్న ఈ స్పై థ్రిల్లర్ ఇది. ఈ చిత్రానికి రైటర్ గా పని చేస్తున్న అబ్బాస్ ఓ అప్‌డేట్ ఇచ్చారు. ''వార్ 2' షూటింగ్ దాదాపు పూర్తయింది. ఆగస్టు 25న విడుదలయ్యే అవకాశం ఉంది. ఆరోజు హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌లను థియేటర్‌లో కలుద్దాం. 'వార్ 2'లో డైలాగులన్నీ నేనే రాశాను. అందరికి నచ్చేలా ఉంటాయి. షారుక్‌ఖాన్, సిద్ధార్థ్ ఆనంద్‌ల కాంబోలో ఓ సినిమా ప్రారంభం కానుంది. 'పఠాన్ 2' కూడా సిద్ధమవుతోంది. ఈ రెండు సినిమాలకు రచయితగా వర్క్ చేస్తున్నాను. '' అని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అబ్బాస్ తెలిపారు. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా తెరకెక్కిన చిత్రం 'వార్'. ఈ స్పై థ్రిల్లర్ సూపర్‌హిట్ కావడంతోపాటు భారీ వసూళ్లు రాబట్టింది. సినిమాపై అంచనాలు ఉండటంతో దీనికి సీక్వెల్‌గా 'వార్ 2' తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ రా ఏజెంట్‌గా నటించనున్నట్లు తెలుస్తోంది. గతంలో సల్మాన్ ఖాన్, హృతిక్ రోషన్, షారుక్‌ఖాన్‌లు ఏజెంట్ పాత్రల్లో నటించి మంచి విజయాన్ని అందుకున్నారు. వీటన్నింటికంటే భిన్నంగా ఎన్టీఆర్ పాత్ర ఉంటుందని వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఎన్టీఆర్ ఓ షెడ్యూల్ చేసి వచ్చారు. ఈ సినిమా పూర్తయిన తర్వాత తారక్ ప్రశాంత్ నీల్ చిత్రం షూటింగ్‌లో పాల్గొనున్నారు.

# ఛావాను రిజెక్టు చేసిన మహేష్‌బాబు



బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం ఛావా. రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించగా.. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించాడు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ టాక్‌తో దూసుకెళుతుంది. ఇప్పటికే రూ.150 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రూ.200 కోట్ల దిశగా దూసుకెళుతుంది. అయితే ఈ సినిమా కథ మొదట సూపర్ స్టార్ మహేశ్ బాబు దగ్గరికి వచ్చినట్లు తెలుస్తుంది. ఈ మూవీ దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ శంభాజీ పాత్ర కోసం మొదట మహేశ్ బాబు సంప్రదించినట్లు తెలుస్తుంది. అయితే ఈ ప్రాజెక్ట్ నచ్చని మహేశ్ రిజెక్ట్ చేశాడు. దీంతో చాలా రోజుల తర్వాత మళ్లీ ఇదే కథతో విక్కీ కౌశల్ దగ్గరికి వెళ్లగా విక్కీ ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. అయితే మహేశ్‌కి ఇలా సూపర్ హిట్ అయిన సినిమాలు రిజెక్ట్ చేయడం కొత్తేమి కాదు. ఇంతకుముందు కూడా మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన గజిని సినిమాను, అల్లు అర్జున్ నటించిన పుష్ప సినిమాను రానా నటించిన లీడర్, రణబీర్ కపూర్ హీరోగా వచ్చిన యానిమల్, ప్రభాస్ వర్షం, రవితేజ ఇడియట్, విజయ్ దళపతి నన్బన్, నాగ చైతన్య ఏ మాయ చేసావే, పూరీ జనగణమన (ప్రాజెక్ట్ స్టార్ట్ కాలేదు) తదితర సినిమాలను మహేశ్ రిజెక్ట్ చేశాడు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

- నైపుణ్య, శిక్షణాభివృద్ధికి ఊతం
- కలెక్టర్ పి.ప్రావీణ్య
- దామెర మండలం ల్యాదెల్లలో ఏర్పాటు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదెల్లలోని సాగునీటి పారుదల శాఖకు సంబంధించిన పాత భవనాలు ఖాళీగా ఉండటంతో అందులో మహిళలు ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు వీలుగా నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ఈ మేరకు గురువారం సదరు భవానాలను వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులతో కలెక్టర్, అధికారులు సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు ఆసక్తి ఉన్న రంగాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో పాటు వారికి నైపుణ్యాభివృద్ధిని సాధించే విధంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె ప్రకటించారు. ఇరిగేషన్ శాఖకు చెందిన పాత భవనాలకు మరమ్మతు పనులతో పాటు తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, టాయిలెట్స్, విద్యుత్, లైటింగ్, పెయింటింగ్, తదితర పనులు పూర్తి చేసినట్లయితే నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంతో పాటు చిన్న తరహా ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మండలంలోని స్వయం సహాయక సంఘాలకు కావాల్సిన శిక్షణ, వనరులను సమకూర్చేందుకు వీటిని పరిశీలించినట్లు తెలిపారు. వి-హబ్, పరిశ్రమలు, ఐటీ శాఖలతో ఒప్పందం చేసుకుని ఈ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంతో పాటు చిన్న తరహా ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కేంద్రాన్ని ప్రారంభించేందుకు అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖలు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను తయారు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ జనపనార (జ్యూట్) సంచుల తయారీతోపాటు ఇతర జ్యూట్ ఉత్పత్తులను మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు మిషన్, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, బ్రాండింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, కుట్లు అల్లికలు, మగ్గం, రెడీమేడ్ దుస్తుల తయారీ, కంప్యూటర్, తదితర అంశాలలో శిక్షణ ఇచ్చేందుకు ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ మేన శ్రీను, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# స్ప్రింగ్ స్ప్రీలో సందడి చేయనున్న బ్రహ్మానందం

- ఎన్ఐటీలో ఈ నెల 28 నుంచి మార్చి 2 వరకు
- ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు సుముఖత

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రతిష్టాత్మక వార్షిక సాంస్కృతిక మహోత్సవమైన స్ప్రింగ్ స్ప్రీ-2025 కు ఎన్ఐటీ, వరంగల్ ముస్తాబవుతోంది. దక్షిణ భారతదేశంలోని ప్రముఖ కళాశాలల వార్షికోత్సవాల్లో ఒకటిగా పేరుగాంచిన స్ప్రింగ్ స్ప్రీలో సంగీతం, నృత్యం, కళలు, వినోదం వంటి వివిధ రంగాల్లో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి వేదికగా భావిస్తారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, కళాకారులు, ప్రదర్శకులు పెద్ద ఎత్తున ఈ మహోత్సవానికి హాజరుకానున్నారు. పోటీలు, వర్క్‌షాపులు, ప్రో-షోలు లాంటి విభిన్న కార్యాక్రమాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేయనున్నాయి. సాంస్కృతిక ప్రదర్శనలు, సాహిత్య కార్యక్రమాలు, సాహస క్రీడలు, సంగీత విభావరి వంటి అనేక కార్యక్రమాలతో స్ప్రింగ్ స్ప్రీ-2025 యువతలోని ప్రతిభను, సృజనాత్మకతను ప్రోత్సహించనుంది. ఈ వేడుకలకు మరింత ఉత్సాహాన్ని అందిచేందుకు పద్మశ్రీ డాక్టర్ బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తన అమోఘమైన హాస్యంతో కోట్లాదిమంది సినీ ప్రేమికుల హృదయాలను గెలుచుకున్న బ్రహ్మానందం స్ప్రింగ్ స్ప్రీ-2025 వేదికపై సందడి చేయనున్నారను.

# బీసీ రిజర్వేషన్ చట్టబద్ధత కేంద్రానిదే

- అందుకు అన్ని పార్టీలు సహకరించాలి
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు చట్టబద్ధత కల్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. అందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లోనూ 42 శాతం వాటా దక్కేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ వెంటనే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి బీసీ రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించాలని శ్రీహరి డిమాండ్ చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు, పార్టీ ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో సాగు నీటి సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ లోపేతం, స్థానిక సంస్థల ఎన్నికలపై నాయకులతో చర్చించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలన్నారు. అందుకు అనుగుణంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల సమన్వయ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తగ్గేదేలే..!



- అనుమతి లేకున్నా నిర్మాణం
- ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం నిర్వాకం
- పంచాయతీ కార్యదర్శి నోటీసులిచ్చినా స్పందించని వైనం
- సదరు పాఠశాలకు ఎమ్మెల్యే అండదండలు

హనుమకొండ జిల్లా దామెర మండల పరిధిలోని పులుకుర్తి గ్రామంలో ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం తగ్గేదేలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. స్కూల్ నిర్మాణానికి అనుమతి లేకున్నా యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ విషయమై గ్రామపంచాయతీ సెక్రెటరీ ఇప్పటికే రెండు సార్లు నోటీసులు ఇచ్చినా అంతా నా ఇష్టం అనే రీతిలో నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. సదరు పాఠశాల యాజమాన్యానికి ఎమ్మెల్యే అండ దండలు మెండుగా ఉన్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకే అధికారులను సైతం లెక్కచేయకుండా ఇష్టారాజ్యంగా పాఠశాల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కాగా సర్కారు ఆదాయానికి గండి కొడుతూ అనుమతులు లేకుండానే నిర్మాణాలను కొనసాగిస్తున్న సదరు యజమానిపై సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు వెంటనే తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభించడంతోపాటు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయాలనుకునే వారికి భయం పుడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

– వరంగల్ వాయిస్, దామెర

# రాజలింగమూర్తి హత్యపై కీలక నిర్ణయం



- సీబీసీఐడీ విచారణకు ప్రభుత్వ ఆదేశం
- మాజీ ఎమ్మెల్యే హత్య చేయించాడని మృతుడి భార్య ఆరోపణ

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య తీవ్ర కలకలం రేపుతోంది. లింగమూర్తి హత్య ఘటనను తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ హత్యపై సీబీసీఐడీ ఎంక్వైరీ వేయాలని నిర్ణయించింది. మేడిగడ్డ అవినీతిపై పోరాడుతున్నందుకే లింగమూర్తిని హత్య చేసారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. మరోవైపు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి, ఆయన అనుచరులే రాజలింగమూర్తిని చంపారని మృతుడి భార్య సరళ, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అన్నీ ఆపేస్తే రూ.10 లక్షలు ఇస్తామంటూ గండ్ర వెంకటరమణా రెడ్డి ఆఫర్ ఇచ్చిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. మేడిగడ్డ కేసు గెలుస్తే బీఆర్ఎస్ పార్టీ పరువు పోతుందన్న అక్కస్సుతోనే తన భర్తను దారుణంగా హత్య చేయించారని అన్నారు. కొత్త హరిబాబు, రేణిగుంట్ల సంజీవ్, బుర్ర చంద్రయ్య, బుర్ర కొమురయ్య, రేనిగుంట్ల కొమురయ్య మరికొంతమంది ఈ హత్యలో పాల్గొన్నారని సరళ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై లింగమూర్తి కేసు వేశారు. ఆ ఫిర్యాదుతో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుతో పాటు ఐదుగురిపై కేసు నమోదైంది. దీంతో పాటు భూపాలపల్లిలో వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణంపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై కూడా రాజలింగమూర్తి కేసు వేశారు. దీనిని జీర్ణించుకోలేకనే సామాజిక వేత్త రాజలింగమూర్తిని దారుణంగా హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మాజీ కౌన్సిలర్ భర్త రాజలింగముర్తి హత్యను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. హత్యకు కారకులను వెంటనే పట్టుకోవాలని పోలీసులను ఆదేశించామని తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com